
క్రైన్ కథోత్సవం - 2005 కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

# అమృత మూర్తులు

## యలమర్తి అనూరాధ




ఉషోదయాన ఉదయించే బాలసూర్యుడిలా నిద్రలేచాడు ఉదయ్‌కిరణ్. దేవునికి ప్రార్థన చేసి మంచం దిగుతూనే వీధి గుమ్మం వైపు వెళ్ళాడు. అప్పుడే పుట్టిన పాపలా ఉన్న పేపరును చేతుల్లోకి తీసుకున్నాడు. చదివేది ఆరవ తరగతే అయినా నిత్యం పేపరు చదవనిదే ఏదోలాగా ఉంటుందంటాడు. ఏ రోజయినా ఆలస్యంగా నిద్రలేచి కుదరక పేపరు చదవకపోతే ఆరోజంతా ఏదో వెలితిగా బాధపడతాడు. దైనందిన కార్యక్రమాల్లో అదీ ఒకటిగా మిగిలిపోయింది.

రోజూలాగా పేపరు చదవటం లేదు. దేని కోసమో వెతుకు తున్నాడు. ఆ వెతుకులాటకు ప్రారంభం ఆరోజే. అలా రోజూ వెతకటం, ఏ రోజయినా తనకు కావల్సింది దొరికితే వెంటనే దాన్ని తన దగ్గర ఉన్న చిన్న తెల్ల పుస్తకంలో వ్రాసుకొని సంతృప్తి పడటం. అలా పదిరోజులు

గడిచిపోయాయి.

వాడి తాతయ్య 'తరంగం' ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు. ఆ చిన్ని మనసులోని ఆరాటాన్ని అభినందిస్తూనే ఉన్నాడు. ఒక ప్రక్క ఆనంద భాష్పాలు మరో ప్రక్క విషాద మేఘాలులా ఉందతని పరిస్థితి.

ఆ రోజు తన జీవితంలో అత్యంత విషాదకరమైనరోజు. స్కూలులో ఉదయ్ కళ్ళు తిరిగి పడిపోయాడని ఫోను వచ్చింది. వెంటనే తను వెళ్ళి వాడిని తమ ఫ్యామిలీ డాక్టరుకు చూపించాడు. అది మొదలు ఎందరెందరో వైద్యులను కలిసాడు. ఫలితం లేకపోయింది. ఎవరూ వాడికొచ్చిన వ్యాధి ఏమిటో కనిపెట్టలేకపోయారు. ఉన్నట్టుండి కళ్ళు తిరిగి పడిపోవటం, మళ్ళీ వాడంతట వాడే లేచి మామూలుగా తిరగటం. ఇదేదో గొప్ప ఉపద్రవంలాగే తోచింది తనకి. శారీరకంగా ఏ బాధలేక పోయినా ఆపేరు తెలియని జబ్బు తన మనవడికే రావాలా ? వాడ్ని అలా ఆ మైకంలోనే తీసుకెళ్ళిపోతే .. ఆ ఊహే ఆయన్ని చలింపచేస్తోంది. ఎవరూ లేని ఏకాకి జీవితానికి ఒక చిన్న ఆశాకిరణం ఉదయ్. వాడు లేని బ్రతుకును తను ఊహించలేడు. ఉన్నట్టుండి హార్ట్ అటాక్ తెచ్చుకొని తన కొడుకు, ఆ విషయం విని తట్టుకోలేక తన కోడలు ఒక్కసారే చనిపోతే పసిగుడ్డు ఉదయ్‌ని తీసుకొచ్చి తనే తల్లీ తండ్రి అయి పెంచసాగాడు. తనకేం జరిగినా పట్టించుకోడు. కానీ వాడు రవ్వంత బాధతో నొసలు చిట్లించినా తన గుండెను మెలి త్రిప్పినంత బాధపడతాడు. అందుకే అన్నారేమో అసలు కంటే వడ్డీ ముద్దని.

పట్టణ పరిసరాలకు కాస్త దూరంగా తన నివాసం ఏర్పరచుకున్నాడు. సాయంత్రం స్కూలు నుంచి రాగానే కాసేపు ఈ పంటపొలాల దగ్గరకు తీసుకువస్తాడు. ఆ చల్లగాలి అయినా వాడిశరీరంలో తెలియనిజబ్బు మంటను తగ్గిస్తుందేమోనని. ఇదెక్కడి మాయరోగం! కాన్సర్, ఎయిడ్స్‌కి మించినదిలా ఉంది. మానవుడు ఎన్నో కనిపెట్టి సైన్సు గొప్పతనాన్ని చూపించాలని ప్రయత్నిస్తుంటే ఎవరికీ తెలియని జబ్బులను సృష్టించి భగవంతుడు అప్పుడప్పుడు తనున్నానని గుర్తు చేస్తూనే ఉన్నాడు. ఆ గుర్తింపు తన మనవడితోనే మొదలవ్వాలా? అనుకున్నాడు కానీ తను ఇంత సంకుచితంగా ఆలోచిస్తున్నాడేం? అని విస్తుపోక మానలేదు. విశాల భావాలకు ఆలయం తన హృదయం. చిన్నతనం నుంచీ దాన్ని రాగంలా మార్చి రంగరించి పోసాడు తన మనవడికి. అలాంటిది ఈ రోజు ఇలా ఎందుకు బాధపడుతున్నాడు?

స్వార్థం అనే కలుపు మొక్కను తను చుట్టుప్రక్కల లేకుండా జాగ్రత్త పడుతున్నాడే? అలాంటిది అది విత్తులా తన మదిలో నాటుకోవాలని ప్రయత్నిస్తోందా ? వీల్లేదు అలాంటిది ఎప్పటికీ జరగటానికి లేదు. దాన్ని సమూలంగా నాశనం చేసే వరకూ తను నిద్రపోడు. ఇది సత్యం.

"ఉదయ్ ! ఏడయింది కన్నా ! రా ! కాసేపు వచ్చి కళ్ళుమూసుకొని ఆ సూర్య భగవానుడి ముందు కూర్చో !"

'అలాగే తాతయ్యా !' అంటూ వచ్చి బుద్ధిగా కూర్చున్నాడు.

"కనిపించే వైద్యుడు సూర్యుడు. అందుకే ఉదయ వేళలో ఒక అరగంట తనూ, తన మనవడు ఆయన కిరణాల వానలో అభ్యంగన స్నానం చేసి ఆరోగ్యానికి అదనపు శ్రద్ధనిచ్చి ఆయుష్షు పెరగటానికి ప్రయత్నిస్తున్నాడు. ఫలితం తప్పక ఉంటుందని తన ప్రగాఢ నమ్మకం.

"ఉదయ్ ! ఇక చాలు లేమ్మా !"

"అలాగే"

"తొందరతొందరగా రడీ అయితే నిన్ను స్కూల్లో దింపేసి వస్తాను. బుద్ధిగా చదువుకుందువుగానీ" "చిటికెలో తయారయిపోతాను. నువ్వే చూస్తావుగా" అంటూనే పరుగు తీసాడు కుందేలులా.

✷ ✷ ✷

శారదా టీచర్ క్లాసులోకి వచ్చింది. పిల్లలంతా మర్యాదగా లేచి నిలబడ్డారు.

"గుడ్‌మార్నింగ్ టీచర్" అన్నారు అందరూ గొంతు కలిపి.

వెరీగుడ్‌మార్నింగ్! అందరూ కూర్చోండి అన్నాక పిల్లలంతా కూర్చున్నారు.


అప్పుడు ఆమె 'మానవత్వం' పాఠం తీయమని చెప్పి వివరంగా చెప్పింది. అంతే ! అప్పటిదాకా ఉదయ్ హృదయంలో తాతయ్య పెంపకంలో మొగ్గగా ఉన్న మానవత్వం ఈ పాఠంతో పుష్పంలా వికసించింది. తనకు తానే ఒక ధృఢనిశ్చయానికి వచ్చాడు. ఆ కళ్ళలో వెలుగు ఇంకెందరిమనసుల్లో వెలుగులు నింపుతుందో వేచిచూడాల్సిందే. స్కూలు వదిలేసాక గేటు బయటకు వస్తున్న ఉదయ్‌కి వాచ్‌మాన్ ఒక పిల్లవాడిని ప్రక్కన కూర్చో పెట్టుకోవటం గమనించాడు.

ఎప్పుడూ ఆ బాబును తను చూడలేదు. ఎంత ముద్దుగా ఉన్నాడో! అనుకున్నదే తడవుగా అక్కడ చేరి ఎవరీ బాబు ? అని అడిగాడు వాచ్‌మాన్‌ని.

"నా బాబే బాబూ. ఇంటికాడ మా ఇంటిది ఒల్లు బాగోక మంచానపడింది. ఈడికా కళ్ళులేవు. కనబడక ఏ అఘాయిత్యం జరుగుతుందోనని నేనే ఇలా తీసుకొచ్చాను.

''అలాగా'' అంటూ ఆలోచనల్లో పడ్డాడు ఉదయ్.

'ఎంత బాగున్నాడు



# బురఖా

నువ్వు మాటిమాటికీ చెప్తావ్ !
అయితే నాకు పిసరంతైనా
నమ్మకం కలగదు
దీనిని నా కోసం
స్వయంగా ఖుదా చేశాడని !!
నీ ఆదేశంతో ఎప్పుడు
ధరించినా దీన్ని
బక్కురుకుపోయిన నా దేహం
బొత్తిగా దీనిని
స్వీకరించదు !!
ప్రతీసారి గొంతెత్తి
గట్టిగా మొత్తుకుంటుంది !
లేదు లేదు
దీన్ని ఖుదా కాదు
నువ్వే తయారుచేశావని !!
నా ఖుదావి నువ్వే అని
అనిపించుకోవాలన్న
లోభం నీకు !!
దీన్ని నాకు
నువ్వే తొడిగావే !!!

– పవన్‌కిరణ్

తెలుగు అనువాదం : డా॥చాగంటి తులసి

!పాపం కళ్ళులేవా? తనలాగా ఈ రంగుల ప్రపంచాన్ని చూడలేదన్న మాట. కొందరు ఇలా ఎందుకు పుడతారు ?ఏదో పాపం చేసారంటారే! అసలు పాపం అంటే ఏమిటి ? తాతయ్యని తప్పక అడగాలి అనుకుంటూ వడివడిగా అడుగులు వేస్తూ ఇంటికి చేరాడు.

తాతయ్య ఉయ్యాల బల్లమీద ఊగుతూ ఏదో ఆలోచిస్తున్నాడు. స్కూలు బ్యాగును అలమరలో పెట్టి కాళ్ళూ, చేతులు శుభ్రంగా కడుక్కొని మంచినీళ్ళు త్రాగాడు. ఇంకా తాతయ్య ఆలోచనలోనే ఉన్నాడు. ఈ మధ్య అలానే ఉంటున్నాడు. లేకుంటే తను స్కూలు నుంచీ వచ్చే సమయానికి గుమ్మం దగ్గిరే ఎదురు వచ్చి తన బ్యాగును అందుకునే వాడు. అది లోపల పెట్టి మంచినీళ్ళు తీసుకు వచ్చి ఇచ్చే వాడు. అలా ఆలో చిస్తూనే తాతయ్య దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు చూసాడు మనవణ్ని ఆయన.

'అరె ! ఉదయ్ నాన్న! వచ్చేసావా. నేను చూడనే లేదురా. కాళ్ళు కడుక్కున్నట్లున్నావే! మంచినీళ్ళు తాగావా ?'' అడిగాడు ఆప్యాయంగా.

'ఆఁ !' అన్నాడు.

'దా! ఇలా నా ప్రక్కన కూర్చుందువు గానీ, అంటూ ఊయలని ఆపి ఉదయ్‌ని ప్రక్కన కూర్చో పెట్టుకున్నాడు.

అప్పటిదాకా ఉగ్గ పెట్టు కొని ఉన్న ఉదయ్ "తాతయ్యా ! నాదొక సందేహం".

"అడుగుకన్నా !"

''మన చుట్టూ ఉన్న వాళ్ళంతా ఒకలా ఉండరేం ? కొందరు గ్రుడ్డివాళ్ళు, కొందరు కుంటి వాళ్ళు, మరికొందరికి గుండెజబ్బులు. ఇలా ఎందుకు జరుగుతోంది ?"

"ఓ అదా చెబుతా .. చెబుతా"

"చూడు ఉదయ్! అందరూ ఒకలా ఉండటం లేదని గమనించావు బాగుంది. అలాగే అందరి మనస్తత్వాలు కూడా ఒకలా ఉండవు. చూడు మన గుమ్మం ముందు బిచ్చగాళ్ళు రాగానే ఎక్కడ ఉన్నా పరుగున వెళ్ళి బియ్యమో, అన్నమో నువ్వు పెడతావు మరి ప్రక్కింటి బాలూ "ఫో ! పోవయ్యా !" అని కసురుకుంటూ వాళ్ళముందే తను తింటుం టాడు. మనకున్నదాంట్లో లేనివారికి కొంత పెట్టడం నేర్చుకోవాలి. అలాచేయని వాళ్ళంతా మళ్ళీ జన్మలో ఇలా ఏదో ఒక అవలక్షణంతో పుడతారు. మనిషి బాగుంటే చాలదు. మనసు కూడా బాగుండాలి. ఆ మనసు ఎప్పుడూ స్వచ్ఛంగా పరులకు ఉపయోగపడుతూ ఉండాలి. ఇంకా వివరంగా చెప్పాలంటే చంద్రుడిలా ఉండాలి. మానవత్వపు వెన్నెలని పరవాలి.

"అలాగా !" అన్నాడు.

వాడి బుల్లిబుర్రలో అప్పటిదాకా ముసిరిన మేఘాలు అన్నీ మాయమయి నిర్మలమైన ఆకాశంలా తయారయ్యాడు. ఆ రోజు రాత్రి తన తెల్లపుస్తకంలో ఏదో రాసుకోవటం మాత్రం మరిచిపోలేదు.

ప్రక్కింట్లోంచి ఏడుపులు విన్పిస్తున్నాయి.

చదువుకుంటున్న ఉదయ్ ఒక్క ఉదుటున పరుగెత్తాడు కంగారుగా !

'నా పాప నాకు దక్కదా ? నా పాప నాకు దక్కదా ?' అని ఆవిడ ఒకటే ఏడుస్తోంది.

'ఊరుకో' ఏం చేస్తాం! మనం బీదోళ్ళం. ఆ విషయం తెలిసినా జబ్బులన్నీ మనలాంటి వాళ్ళకే రాస్తాడు ఆ భగవంతుడు.

"లక్షరూపాయలు పెట్టి కిడ్నీ ఎలా కొనిస్తాం మామా!మింగటానికి మెతుకు వెతుక్కునే వాళ్ళం! పంటల్లో నష్టం వస్తోందని నీ కిడ్నీ అమ్మేసావ్ ! నావి పాడయిపోయాయనిడాటరే చెప్పాడు. నేను బ్రతికుండగానే నా తల్లి పోతుందా ? నేనది కళ్ళ చూడాలా ? నన్నే ముందు ఆ దేముడు తీసుకెళ్ళిపోతే బాగుంటది మామా !"

ఆమె రోద నకు అంతు లేదు.

"ఏదో మార్గం దొరకపోద్దా! చూద్దాంలే ముందు నువ్వు ఏడవమాక" ఓదార్పుగా అన్నాడు అతను.

"ఇంకేం మార్గముంది? అందరం కలిసి ఏనూతిలోనో దూకిచావడమే ! అంత కన్నా మరో దిక్కులేదు.

నెమ్మదిగా వెనక్కి తిరిగాడు ఉదయ్ ! తోటనుంచి తాతయ్య వచ్చేవరకూ ఓ మూల కూర్చున్నాడు.

"వరండాలో చెప్పులు వదులుతూ ఉదయ్‌ని చూసాడు ఏమిటి? వీడు ఇలా ఉన్నాడు చెప్మా !" అనుకున్నాడు.

బావి దగ్గరకు వెళ్ళి ముఖం కడుక్కొని వచ్చాడు.

"ఉదయ్ ! ఇటురా నాన్నా !" అని

పిలిచాడు. పలకనే లేదు. అలా రెండు, మూడు సార్లు"పిలిచాక పిలిచావా తాతయ్యా"! అన్నాడు.

"అవునురా కన్నా! చిట్టినాన్న ఎందుకో పరధ్యానంగా ఉన్నాడే!"

"కిడ్నీలు అమ్ముకుంటారా తాతయ్యా!" సూటిగా వచ్చింది ప్రశ్న.

అమ్ముతున్నారురా ! నిజం చెప్పాలంటే అలా మన శరీరంలో భాగాలు అమ్ముకోవటం చాలా తప్పు. భగవంతుడు ప్రసాదించిన శరీరం పదిమందికి ఉపయోగపడాలి. ఎంతోమందికి ఆదర్శంగా నిలబడటానికి నిదర్శనంగా ఉండాలిరా ! కానీ కష్టాలు గట్టెక్కించుకోవటానికి ఉన్న రెండు కిడ్నీలలో ఒకటి అమ్ముకోవటం కొంత మందికి అలవాటుగా మారింది.

'మరి ఒకటి అమ్మేస్తే మిగిలిన దానితో బ్రతకొచ్చా ?'

'దానికేం జబ్బు రానంతవరకూ బ్రతకొచ్చు'

'అలాగా !' అని ఒక్క నిముషం ఆగి "తాతయ్యా ! బ్రతికున్న వాళ్ళ దగ్గరనుంచి తీసే బదులు చనిపోయిన వాళ్ళ దగ్గర నుంచి తీసి ఇలాంటి వాళ్ళకు పెడితే బాగుంటుంది కదా?"

"చాలా బాగుంటుంది ఉదయ్ ! కానీ శవాన్ని కాల్చి బూడిద చెయ్యడానికి మాత్రమే ఒప్పుకుంటారు ఈ జనం. చనిపోయి కూడా మరెందరి జీవితాలకో వెలుగు నిచ్చే అవకాశం ఉన్నా ఉపయోగించుకోరు. అదే నేనెప్పుడూ బాధపడుతుంటాను. అదే జరిగితే ఈ లోకంలో రోగుల సంఖ్య చాలా తగ్గిపోతుంది. ఆ జ్ఞానం ఈ మానవులకి ఎప్పుడు వస్తుందో అర్థం కాదు" అన్నాడు నిట్టూరుస్తూ.

"మరి నీ శరీరభాగాలను అలా ఎవరికయినా ఇవ్వమని చెప్పావా తాతయ్యా!"

"ఆఁ ! అలా కాగితం రాసిచ్చాను. అందరూ అలా ఉండాలని కోరుకొనే నేను ఆ పనికి ముందుండకపోతే ఎవరు ముందుకొస్తారు చెప్పు ?"

"నిజం చెప్పావు తాతయ్యా ! అందుకే నువ్వంటే నాకిష్టం" దగ్గిరగా వచ్చి రెండు చేతులతో తాతయ్యను చుట్టేసి ముద్దు పెట్టుకున్నాడు.

ఆ రాత్రి ఒక తెల్లపేపరు తీసుకొని ఉత్తరం రాయటం ప్రారంభించాడు.

✷ ✷ ✷

గౌరనీయులైన ఆరోగ్యశాఖాధిపతి గారికి,

నా నమస్కారములు !

నేనో అంతు తెలియని వ్యాధితో బాధపడుతున్నాను. ఏ నిమిషాన చచ్చిపోతానో నాకే తెలియదు. చనిపోయే ముందు నేను పది మందికి ఉపయోగపడాలన్నదే నా ఆశయం. బుడ్డోడు వీడికి ఆశయాలేమిటనుకోకండి. నేటిబాలలే రేపటి పౌరులు కదా !

నాకు బాగోలేదని తెలిసిన దగ్గరనుంచీ పేపర్లో గుండె జబ్బు ఉన్నవాళ్ళవి, కళ్ళు లేని వాళ్ళవి అడ్రస్సులు నా బుల్లి పుస్తకంలో రాసుకున్నాను. అది ఎప్పుడూ నా జేబులోనే ఉంచుకుంటాను. ఎవరయినా బీదవారికి నా శరీర అవయవాలు పనికొస్తే అమర్చగలరు. దానికి నేను మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నానని తెలియజేయడానికే ఈ లేఖ.

నేను మైనర్‌నని నా మాట తీసి పారెయ్యవద్దు. దీనికి నా గార్డియన్ తాతయ్య గారి సహకారం కూడా ఉంది. వారి సంతకం కూడా క్రింద చేయిస్తున్నాను.

చుట్టు ప్రక్కల వాళ్ళను ముందు ఆదుకోవాలి. తర్వాత దూరంగా ఉన్న వాళ్ళకి సాయపడటానికి ప్రయత్నించాలి అనే మా తాతయ్య మాటలే నాకు స్ఫూర్తి.

మా ప్రక్కింట్లో వాళ్ళ పాపకు కిడ్నీ, వాచ్‌మన్ కొడుకుకు నా కళ్ళు ఇవ్వండి. తర్వాత మిగిలినవి ఆ పుస్తకంలో ఉన్న అడ్రస్సుల వాళ్ళ కివ్వండి. ఇంకా... ఇంకా... ఎవరికైనా... ఎవరైనా... బీదవాళ్ళకి మాత్రమే! నా శరీరంలో అణువణువు ఉపయోగపడాలి. అదే నాకు అత్యంత ఆనందమైన విషయం.

గుండె జబ్బుతో బాధపడుతున్నానని, గుండెమార్పిడి చేస్తే ఆ బాబు బ్రతుకుతాడని, అంత డబ్బు తమ దగ్గిర లేదని, విరాళాలు అందించమని వేడుకున్న ఓ తల్లి తండ్రులకు నా గుండెనే విరాళంగా ఇవ్వాలని నా ఆశ. అదే నా పుస్తకంలో మొదటి అడ్రస్. అలాంటివే ఎన్నో! మరి సెలవా....

<u>తరంగం</u> ఇట్లు
తాతయ్యసంతకం ఉదయ్‌కిరణ్

✷ ✷ ✷

ఉదయాన లేవగానే ఆ ఉత్తరాన్ని తాతయ్య చేతుల్లో పెట్టాడు. అది చదివిన ఆయన నోట మాట రాలేదు ఒక్క క్షణం. ఆ తర్వాత వాడిని ఎత్తుకొని ముద్దులతో ముంచెత్తాడు " నా వారసుడివి నువ్వేరా అంటూ"

"మానవత్వం చూపించే అందరూ అమృతమూర్తులే!" మనసు పదే పదే పలుకుతోంది ఆ మాటలను.




హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ప్రొ॥ననుమాస స్వామిని సత్కరిస్తున్న ప్రొ॥ కొలకలూరి ఇనాక్. చిత్రంలో డాక్టర్ ఆవుల మంజులత, బత్తిన హరినాథగౌడ్, కవి రఘుశ్రీ, ప్రొ॥ కుసుమారెడ్డి ఉన్నారు.